సాక్షి
మంచిర్యాల

బుధవారం । 21 । జూన్ । 2023



**ఆరోగ్య 'యోగ'ం** 8లో▸

మనదేశంలో పుట్టిన యోగా ప్రపంచ దేశాలకు విస్తరించింది. యోగా సాధనతో దీర్ఘకాలిక రోగాలు నయమవుతాయి.

**ముగిసిన పదోతరగతి పరీక్షలు**

మంచిర్యాలఅర్బన్: పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. చివరిరోజు సాంఘికశాస్త్రం పరీక్షకు 163మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 93 మందే హాజరయ్యారు. 70మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలు సజావుగా జరిగాయని డీఈవో యాదయ్య తెలిపారు.

గరిష్టం/కనిష్టం
40.0 /29.0

**వాతావరణం**

ఎండ తీవ్రత కొనసాగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం మేఘావృతమవుతుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశముంది.

## న్యూస్‌రీల్

### బీజేపీ సమావేశం విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రఘునాథరావు

లక్సెట్టిపేట: ఈనెల 21న మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో నిర్వహించనున్న బీజేపీ సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు రఘునాథరావు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐబీ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హాజరవుతున్నారని తెలిపారు. బీజేపీ హయాంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు హరిగోపాల్, నరేశ్‌చంద్, కిషన్, గుండ ప్రభాకర్, రమేశ్‌చంద్, వేముల మధు, రమేశ్ పాల్గొన్నారు.

### ముందస్తు యోగా దినోత్సవం

మంచిర్యాలటౌన్: మైత్రి యోగా ప్రకృతి చికిత్సా కేంద్రం ఆధ్వర్యంలో ముందస్తు తొమ్మిదో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ కాలనీలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు హాజరయ్యారు. యోగా సాధకులతో కలిసి ఆసనాలు వేశారు. అనంతరం యోగా ఇన్‌స్ట్రక్టర్ కోర్సు పూర్తి చేసినవారికి సర్టిఫికెట్లు అందించారు. మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, మైత్రి యోగా శిక్షకులు డాక్టర్ సుకుమార్, డాక్టర్ సమీర, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వీఎస్ఎన్ మూర్తి, ఎంవీఐ వివేకానందరెడ్డి, ఆర్థోపెడిక్ డాక్టర్ త్రినాథరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గుండా సుధాకర్, కౌన్సిలర్ చైతన్యరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు కేవీ ప్రతాప్, లలిత సేవా సమితి అధ్యక్షుడు విశ్వేశ్వర్‌శర్మ, ఏషియన్ టవర్స్ అధ్యక్షుడు చాతరాజు పాల్గొన్నారు.

# వరుణుడు కరుణిస్తాడని..

- అదునుదాటుతుందనే ఆందోళనతో తొలకరికి ముందే విత్తన సాగు
- కొనసాగుతున్న వేసవి ఎండలు
- దుక్కిలోనే మాడుతున్న విత్తనం
- కలవర పెడుతున్న వానాకాలం
- అయోమయంలో జిల్లా రైతాంగం



నెన్నెలలో పొడి దుక్కిలో విత్తనాలు వేస్తున్న కూలీలు

మంచిర్యాలఅగ్రికల్చర్: జూన్ వచ్చిందంటే చాలు అన్నదాతలు వానాకాలం సాగు పనుల్లో బిజీగా కనిపిస్తారు. కానీ.. ఈసారి భిన్నమైన పరిస్థితి నెలకొంది. తొలకరి కోసం నేటికీ రైతులు నిరీక్షిస్తూనే ఉన్నారు. ఆలస్యమవుతుండగా అదునుదాటుతుందని ఆందోళన చెందుతున్నారు. వరుణుడు కరుణించకపోతాడా.. అని పలువురు రైతులు ఎప్పటిలాగే మృగశిరకార్తె (మిరుగుకార్తె) నుంచి పొడి దుక్కుల్లోనే విత్తనాలు వేస్తున్నారు. ఇంకా వానలు కురియక పోవడంతో వేసిన విత్తనాలు దుక్కుల్లోనే మాడిపోతుండగా, మరోసారి విత్తనం వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని దిగులు చెందుతున్నారు. ఈ సమయానికే జిల్లాను రుతుపవనాలు తాకాల్సి ఉంది. కానీ ఇంకా ఎండలు తగ్గక రైతన్నను వానాకాలం కలవరం పెడుతోంది. వానాకాలం ఆరంభమై పక్షం రోజులు గడిచినా వర్షాలు పడలేదు. దీంతో అన్నదాత గుండెల్లో గుబులు మొదలైంది. జిల్లాలో ఇప్పటికే కొన్ని మండలాల్లో పత్తి విత్తనాలు వేస్తున్నారు. కాగా, ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసి భూమిలో తేమ శాతం పెరిగితేనే విత్తనాలు వేయాలని వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

**అడుగంటుతున్న జలాశయాలు**

జిల్లాలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండలు దంచికొడుతున్నాయి. సాయంత్రం ఈదురుగాలులు, మబ్బులు పడుతున్నా వర్షాలు మాత్రం కురవడం లేదు. మృగశిర కార్తె బుధవారంతో ముగుస్తుండగా గురువారం నుంచి ఆరుద్ర కార్తె ప్రారంభం కానుంది. ఈ పాటికి జోరువర్షాలు కురిసి వాగులు, వంకలు పొంగి పొర్లుతుండాలి. చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో కొత్తనీరు చేరి జలమట్టం క్రమేపి పెరుగుతుండాలి. ఇందుకు భిన్నంగా ఇంకా ఎండలు మండుతుండగా జలాశయాలు అడుగంటిపోతున్నాయి.

**94శాతం లోటు వర్షపాతం**

ఈసారి 3.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనా. కానీ.. ఇప్పటివరకు 7వేల ఎకరాల వరకు పత్తి విత్తుకున్నట్లు తెలుస్తోంది. ఆశించిన వర్షాలు కురిస్తే ఈ సమయానికి 50వేల ఎకరాల వరకు విత్తనాలు వేసుకోవాల్సింది. గతేడాది ఇదే సమయానికి 45 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఈ ఏడాది సాధారణ స్థాయి వర్షాలు ఉంటాయని వాతావరణ నిపుణులు చెబుతుండగా ప్రస్తుత పరిస్థితులు రైతుల్లో గుబులు రేపుతున్నాయి. గతేడాది ఇదే సమయానికి జిల్లాలో సగటున 119 మిల్లీమీటర్ల వర్షపాతం కురువగా, ఈ ఏడాది 07 మిల్లీమీటర్ల వర్షపాతమే నమోదైంది. ఈ నెల 20వరకు సాధారణ వర్షపాతం 101.7 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 6.2 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. 94 శాతం లోటు వర్షపాతం నెలకొంది. మృగశిర కార్తె ఆరంభానికి ముందే ఉపరితల ద్రోణి ప్రభావంతో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిశాయి. దీంతో కొంతమంది రైతులు విత్తనాలు వేశారు. ఆ తర్వాత చినుకు పడక విత్తనం మొలకెత్తక ఆదిలోనే నష్టాలు చవి చూశారు.

**తేమ లేకుంటే ప్రమాదమే..**

నేలలో తేమ లేనిదే విత్తనం వేసుకోవద్దని వ్యవసాయశాఖ ఓ వైపు హెచ్చరిస్తున్నా రైతులు విత్తనాలు వేస్తూనే ఉన్నారు. రెండు, మూడు భారీ వర్షాలు కురిసి 60–70శాతం తేమ నేలలో ఉంటేనే విత్తుకోవాలంటున్నారు. పత్తి, కంది, వరి, మొక్కజొన్న పంటలు విత్తుకునేందుకు వచ్చే నెల వరకు సమయం ఉందని చెబుతున్నారు. దుక్కి వేడి తగ్గకుండానే విత్తనాలు విత్తుకోవడం మంచిది కాదని పేర్కొంటున్నారు. విత్తిన ఐదురోజుల వరకు వాన పడకుంటే విత్తనం చెడిపోతుందని చెబుతున్నారు. కొన్ని విత్తనాలు మొలకెత్తినా మొలక దశలోనే మాడిపోతాయని పేర్కొన్నారు. ఇలా.. మొలక ఎండిపోయిన స్థానంలో రెండు మూడుసార్లు విత్తుకుంటే అదనపు ఖర్చుతోపాటు మొక్కల ఎదుగుదలలో వ్యత్యాసమేర్పడి కలుపు తీయడానికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.



హాజీపూర్‌లో పొడి దుక్కిలో పత్తి విత్తనాలు వేస్తున్న కూలీలు

**వానలు పడుతయనుకున్న**



నిరుడు మిరుగుకార్తెలోనే పత్తి విత్తనం వేసిన. ఈసారి నాలుగురోజులు ఆలస్యంగా ఎనిమిదెకరాల్లో విత్తనాలేసిన. వారంరోజులైనా వర్షాలు పడుతలేవు. విత్తనాలు మొలకెత్తలేదు. ఎండలకు దుక్కిలోనే మాడిపోతున్నయ్. ఈ రెండుమూడ్రోజుల్లో వాన పడకుంటే నేను పెట్టిన పెట్టుబడి రూ.35 వేల దాకా నష్టపోవుడే.

– ముదరకోల సదయ్య, రైతు, నెన్నెల

**తొందరపడి విత్తనాలు వేయొద్దు**



తుఫాన్ కారణంగా రుతుపవనాల రాక కొంత ఆలస్యమైంది. ఈనెల 25నుంచి ఉమ్మడి జిల్లాలో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. రైతులు ఒకట్రెండు భారీ వర్షాలు కురిసి 60–70 శాతం తేమ ఉన్న తర్వాతే విత్తనాలు వేసుకోవాలి. పత్తి విత్తేందుకు సమయం ఉంది. తొందరపడి విత్తుకుంటే మొలక రాదు. – శ్రీధర్ చౌహాన్, వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త

### అద్భుత విజయాలు సీవోఈ సొంతం



విద్యార్థులను అభినందిస్తున్న ఆర్‌సీవో, ప్రిన్సిపాల్

బెల్లంపల్లి: విద్యారంగంలో అద్భుత విజయాలు సొంతం చేసుకుంటున్న బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) కళాశాల ఆదర్శనీయంగా మారిందని సంక్షేమ గురుకులాల ఆదిలాబాద్ రీజియన్ ఆర్సీవో కొప్పుల స్వరూపారాణి ప్రశంసించారు. మంగళవారం సీవోఈ కళాశాలలో తెలంగాణ అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా నిర్వహించిన విద్యాదినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు పతాకావిష్కరణ చేశారు. ఆ తర్వాత ఇటీవల కళాశాల నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్ కు ఎంపికైన, అజీమ్ ప్రేమ్‌జీ లాంటి ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీలో సీటు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఘనంగా సన్మానించారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కే రాజ్‌కుమార్, జేవీపీ కొక్కుల రాజేశ్వర్, ఉపాధ్యాయులు శ్యాంసుందర్‌రాజు, శ్రీరామవర్మ, ప్రమోద్‌కుమార్, లక్ష్మీనారాయణ, మిట్ల రమేశ్, అర్జున్, నరేశ్, రాజ్‌కుమార్, సబియాభాను, అజిత, రమాదేవి, కౌసర్, ప్రేమలత, హారిక, రామారావు, గణపతి పాల్గొన్నారు.

### సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మంచిర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యాదినోత్సవాన్ని నిర్వహించారు. కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం–475 ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, కాంట్రాక్ట్ అధ్యాపకుల సర్వీస్‌ను క్రమబద్ధీకరించి, బదిలీలు చేపట్టినందుకు క్షీరాభిషేకం చేసినట్లు తెలిపారు. వివిధ సమస్యలతో క్రమబద్ధీకరణ కాని ఒకేషనల్, జనరల్ కాంట్రాక్ట్ అధ్యాపకులందరి సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేయాలన్నారు. 10శాతం కోటాలో నాన్‌టీచింగ్ సిబ్బందికి జూనియర్ లెక్చరర్స్, లైబ్రేరియన్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని కోరారు.

# లక్ష సాయం.. కోటి తిప్పలు..!

- దరఖాస్తు చేసుకునేందుకు అవస్థలు
- సాంకేతిక కారణాలతో తీవ్రజాప్యం
- మీసేవ, తహసీల్ ఆఫీస్‌లకు జనం
- సర్టిఫికెట్లు రాకుండానే గడువు పూర్తి
- గడువు పెంచాలంటూ విజ్ఞప్తులు

**మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులు ఇలా..**

| మండలం | దరఖాస్తులు | మండలం | దరఖాస్తులు |
|---|---|---|---|
| లక్సెట్టిపేట్ | 882 | నెన్నెల | 349 |
| దండేపల్లి | 812 | తాండూర్ | 316 |
| నస్పూర్ | 655 | వేమనపల్లి | 291 |
| హాజీపూర్ | 439 | చెన్నూరు | 630 |
| మంచిర్యాల | 1,055 | మందమర్రి | 1049 |
| బెల్లంపల్లి | 566 | భీమారం | 249 |
| భీమిని | 138 | జైపూర్ | 431 |
| కన్నెపల్లి | 225 | కోటపల్లి | 376 |
| కాసిపేట్ | 362 | జన్నారం | 606 |

మొత్తం దరఖాస్తులు 9,431



జిల్లా కేంద్రంలోని మీసేవలో సర్టిఫికెట్ల కోసం వేచిచూస్తున్న ప్రజలు



సర్టిఫికెట్ల కోసం మంచిర్యాల తహసీల్ కార్యాలయానికి వచ్చిన ప్రజలు

మంచిర్యాలటౌన్: బీసీ చేతి, కుల వృత్తిదారులకు ప్రభుత్వం పూర్తి రాయితీతో రూ.లక్ష సాయాన్ని అందించేందుకు నిర్ణయించింది. ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తు గడువు విధించింది. మంగళవారం గడువు ముగియనుండగా ఆదాయ, కుల ధ్రువీకరణపత్రాల కోసం పలువురు మీసేవ కేంద్రాలకు క్యూకట్టారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు ఒకేసారి అధికసంఖ్యలో జనం వస్తుండడంతో సర్వర్‌లు మొరాయిస్తున్నాయి. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది. మీసేవలో దరఖాస్తు చేసుకున్నా.. తహసీల్ కార్యాలయంలో వాటిని పరిశీలించి ఆమోదం తెలుపాల్సి ఉంటుంది. దీంతో సర్టిఫికెట్ల జారీలోనూ జాప్యం జరుగుతోంది. దరఖాస్తు చేసేందుకూ నానా తంటాలు పడ్డారు. ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్య కారణంగా గంటకు కనీసం నాలుగు దరఖాస్తులు కూడా ఆమోదించలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలోని అన్ని తహసీల్ కార్యాలయాల్లో వేలాదిగా దరఖాస్తులు పక్కన పెట్టాల్సిన పరిస్థితి. దరఖాస్తు చేసుకునే సమయంలో తహసీల్దార్ ఆమోదించిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం సీరియల్ నంబర్ వేస్తే, ఆయా దరఖాస్తులను తీసుకునేలా రూపొందించారు. దీంతో తహసీల్ కార్యాలయంలో పరిశీలన పూర్తి చేసి, మంజూరు చేసిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ప్రింట్ రాకుండా సర్వర్‌పై భారం పడకుండా ఉండేందుకు మీసేవ కేంద్రాల్లో ఆప్షన్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. రూ.లక్ష ఆర్థికసాయం దరఖాస్తు ప్రక్రియ పూర్తయినా రాత్రివేళ ప్రింట్ తీసుకునేలా మార్పులు చేశారు. జిల్లావ్యాప్తంగా 15వేలకు పైగా దరఖాస్తులు రావాల్సి ఉండగా, సోమవారం మధ్యాహ్నం వరకు 9,431 మాత్రమే వచ్చాయి. తహసీల్ కార్యాలయాల్లో వెయ్యికి పైగా దరఖాస్తులు పరిశీలనకు ఉన్నాయి. కాగా, ప్రభుత్వం దరఖాస్తు గడువు పెంచాలని పలువురు కోరుతున్నారు.

# మహిళల సంపూర్ణ ఆరోగ్యానికే మహిళా క్లినిక్

బెల్లంపల్లిరూరల్: మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసమే వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఆరోగ్య మహిళా (క్లినిక్) క్యాంపులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు సూచించారు. మంగళవారం తాళ్లగురిజాల పీహెచ్‌సీలో నిర్వహించిన ఆరోగ్య మహిళా క్లినిక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. మహిళలకు అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతీ మంగళవారం నిర్వహించే క్యాంపులో వివిధ వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళలు సేవలు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని, సాధారణ ప్రసవాలు అధికంగా జరిగేలా చొరవ తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఇన్‌చార్జి వైద్యులు శివప్రతాప్, శ్రీవిద్య, హెచ్‌ఈవో సమ్మయ్య, సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు

# కేకే–5గని విస్తరణపై ప్రజాభిప్రాయ సేకరణ

- పరిసర ప్రాంతాలకు మౌలిక వసతులు కల్పించాలన్న ప్రజాప్రతినిధులు
- బొగ్గు అవసరం దృష్ట్యా అనుమతులకు ఆలస్యం వద్దన్న వక్తలు



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న యాదగిరి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ సమీపాన సీఐఎస్ఎఫ్ క్యాంపస్‌లోగల కేకే–5 భూగర్భ గని విస్తరణ ఉల్లంఘనపై మంగళవారం పర్యావరణం కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారి లక్ష్మణప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ రాహుల్ హాజరై అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమానికి హాజరైన 22మంది వక్తలు భిన్నాభిప్రాయాలు వ్యక్తంజేశారు. గని పరిసర ప్రాంతాలైన శంకర్‌పల్లి, సండ్రోనిపల్లి, సారంగపల్లి, చిర్రకుంట తదితర గ్రామాలకు మౌలిక వసతులు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఆసక్తి గల వారికి వృత్తి శిక్షణ ఇవ్వాలని కోరారు. కేకే–5 గని భూగర్భ గని కావడంతో ఇబ్బందికర పర్యావరణ ప్రభావం ఉండదని, బొగ్గు ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకుని అనుమతులు ఇవ్వాలని సంబంధిత శాఖను కోరారు. గ్రామాలకు మౌలిక వసతులు కల్పించాలని, పరిసర ప్రాంత గ్రామాల్లో కమిటీలు వేసి ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేయాలని కార్మిక సంఘాల నేతలు అభిప్రాయపడ్డారు. పర్యావరణ, సింగరేణి అధికారులు, యూనియన్ల నాయకులు, కేకే–5 భూగర్భ గని పరిసర ప్రాంత గ్రామాల సర్పంచులు, ప్రజలు, సింగరేణి ఉద్యోగులు పాల్గొన్నారు.

**సౌకర్యాలు మెరుగుపర్చాలి**



కేకే–5 భూగర్భ గనికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని శంకర్‌పల్లి గ్రామ పంచాయతీకి మౌలిక సదుపాయాలు కల్పించాలి. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించి ఆదుకోవాలి. గని నుంచి గ్రామానికి రోడ్డు వేసి వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. రాకపోకల సౌకర్యం మెరుగుపర్చాలి.

– నల్లూరి సది, శంకర్‌పల్లి సర్పంచ్

**యువతకు శిక్షణ ఇవ్వాలి**



ప్రభావిత గ్రామాల్లోని నిరుద్యోగ యువతకు వృత్తివిద్యా కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ, ఉద్యోగాలు ఇవ్వాలి. గ్రామస్తులకు సింగరేణి ఆస్పత్రిలో వైద్యసౌకర్యం కల్పించాలి. కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలి. తాగునీటి సౌకర్యం కల్పించాలి. పాఠశాలల్లో డిజిటల్ విద్యాబోధనకు కావాల్సిన వస్తువులు సమకూర్చాలి.

– నసీరొద్దీన్, కోఆప్షన్ మెంబర్, మందమర్రి మండలం

**వసతుల కల్పనలో విఫలం**



కేకే–5 గని ప్రారంభమై 65 ఏళ్లు అవుతున్నా ప్రభావిత గ్రామాలకు సౌకర్యాలు కల్పించడంలో సింగరేణి విఫలమైంది. ఇప్పటికైనా యాజమాన్యం ప్రత్యేక నిధులు కేటాయించి పరిసర ప్రాంతాలకు కనీస మౌలిక వసతులు కల్పించి ఆదుకోవాలి. కేకే–5 భూగర్భ గనికి కావాల్సిన అనుమతులు వెంటనే ఇవ్వాలి.

– వేల్పుల రవి, జెడ్పీటీసీ, మందమర్రి

**భూములిచ్చినవారికి పరిహారం ఇవ్వాలి**



కేకే–5 భూగర్భ గని పరిసర ప్రాంతాల గ్రామాలకు ప్రత్యేక నిధులు (డీఎంఎఫ్‌టీ) కేటాయించాలి. మౌలిక సదుపాయాలతోపాటు నిబంధనల ప్రకారం యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలి. సింగరేణికి భూములిచ్చినవారికి వెంటనే పరిహారం అందించాలి. తగినసాయం చేసి వెసులుబాటు కల్పించాలి.

– చెన్నకేశవరెడ్డి, పర్యావరణవేత్త

**పర్యావరణ కాలుష్యం లేదు**



సింగరేణిలో పర్యావరణ కాలుష్యం లేదు. కేకే–5గనిలో నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువగా బొగ్గు ఉత్పత్తి చేయడంతో దేశానికి రూ.150 కోట్ల మేలు జరిగింది. విదేశాల నుంచి దిగుమతి తప్పింది. గనిలో బొగ్గు ఉత్పత్తికే పబ్లిక్ హియరింగ్‌తో సమయం వృథా చేస్తున్నారు. ఈ విషయంలో సింగరేణిని అభినందించి వెంటనే అనుమతివ్వాలి.

– సునందరెడ్డి, పర్యావరణవేత్త

**ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేస్తాం**



పరిసర గ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తాం. ఇప్పటికే రూ.419 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులు కేటాయించాం. గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ప్రత్యేక సొసైటీలు ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తాం. ప్రజాప్రతినిధులు సమస్యలు తెలిపితే సాయం చేయడమే కాకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకుందాం.

– జీ మోహన్‌రెడ్డి, జీఎం, మందమర్రి ఏరియా

# తెలంగాణలో విద్యారంగానికి పెద్దపీట

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్
- ఘనంగా విద్యాదినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న విప్ బాల్క సుమన్, వేదికపై ఎమ్మెల్యే దివాకర్‌రావు, కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅర్బన్: దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా విద్యాదినోత్సవాన్ని మంగళవారం స్థానిక ఎఫ్‌సీఏ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. మన ఊరు–మన బడితో సర్కారు పాఠశాలలను అన్ని హంగులతో కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. గురుకులాలతోపాటు పలు విద్యాసంస్థల ఏర్పాటుతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతోందని చెప్పారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ.. మన ఊరు–మనబడి మొదటి విడతలో జిల్లాలో 248 పాఠశాలలను ఎంపికచేసి రూ.90 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం 23 మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు అందజేశారు. అంతకుముందు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. 10జీపీఏ సాధించిన 12 మంది విద్యార్థులను సన్మానించారు. ఉత్తమ సేవలందించిన 11 మంది హెచ్ఎంలు, 19 మంది ఉపాధ్యాయులు, 14 మంది విద్యార్థులు, ఐదుగురు తల్లిదండ్రులు, ఐదుగురు ఎస్ఎంసీ చైర్మన్లు, ఐదుగురు దాతలను సత్కరించారు. ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల ఉత్తమ అధ్యాపకులను ప్రశంసించారు. టీఎల్ఎంలో ఉత్తమ ఆవిష్కరణలకు గాను సబ్జెక్టులవారీగా ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా తొలిమెట్టు (ఎఫ్ఎల్ఎన్) జిల్లా స్థాయి బోధనాభ్యాస సామగ్రిమేళా ఆకట్టుకుంది. 18 మండలాల నుంచి 139 మంది తెలుగు, ఇంగ్లిష్, ఈవీఎస్, మ్యాథ్స్, ఉర్దూ సబ్జెక్టుల ఉపాధ్యాయులు టీచర్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం) తయారు చేసుకుని హాజరయ్యారు. బోధన పద్ధతులపై క్లుప్తంగా వివరించారు. మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, అడిషనల్ కలెక్టర్ రాహుల్, ట్రైనీ కలెక్టర్ గౌతమి, డీఈవో యాదయ్య, డీఐఈవో శైలజ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి, డీఎస్వో మధుబాబు, సెక్టోరల్ అధికారులు చౌదరి, శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

**పాఠశాల భవనం ప్రారంభం**

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని దీపక్ నగర్‌లో మనఊరు–మనబడి కింద రూ.21.52లక్షలతో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని విప్ బాల్క సుమన్ ప్రారంభించారు. ఉపాధ్యాయ సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులున్నారు.

## క్లుప్తంగా

### 26 వరకు సింగరేణి, రామగిరి రైళ్లు రద్దు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్, బల్లార్ష రైల్వేస్టేషన్ల మధ్య నడిచే సింగరేణి, రామగిరి ప్యాసింజర్ రైళ్లను ఈ నెల 26 వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. మూడో రైల్వేలైన్ పనుల నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సికింద్రాబాద్ నుంచి కాగజ్‌నగర్ మధ్య నడిచే భాగ్యనగర్, ఇంటర్ సిటీ రైళ్లు యథావిధిగా నడుస్తాయన్నారు.

### చికిత్స పొందుతూ యువకుడి మృతి


సత్యనారాయణ (ఫైల్)

జైపూర్: ఉద్యోగం రాలేదని ఓ యువకుడు పురుగుల మందు తాగగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన రిక్కుల సత్యనారాయణరెడ్డి(22) బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం కోసం శిక్షణ పొందాడు. సరైన ఉద్యోగ అవకాశాలు రాక ఉద్యోగం వస్తుందో రాదోనని కలత చెందేవాడు. మనస్తాపం చెందిన అతడు ఈ నెల 14న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వైద్యం కోసం మంచిర్యాలకు, అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు.

### వైన్‌షాప్ సీజ్

దహెగాం(సిర్పూర్): మండల కేంద్రంలోని శ్రీ చక్రి వైన్‌షాప్‌ను మంగళవారం ఎక్సైజ్ సీఐ విలాస్ కుమార్ సీజ్ చేశారు. మద్యం బాటిళ్లలో నీళ్లు కలిపి విక్రయిస్తుండగా సోమవారం టాస్క్‌ఫోర్స్ అధికారుల సోదాల్లో దొరికిన విషయం తెలిసిందే. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు షాప్‌ను సీజ్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు. సీజ్ చేసిన వారిలో ఎక్సైజ్ ఎస్సై ఆర్.కిషన్, హెడ్‌కానిస్టేబుల్ కే.లింగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

### సంజయ్‌కుమార్ అరెస్టు సరికాదు


సంజయ్‌ని అరెస్టు చేస్తున్న పోలీసులు

కాసిపేట(బెల్లంపల్లి): కేకే–5 భూగర్భగని విస్తరణలో భాగంగా మంగళవారం మందమర్రిలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో సమస్యలపై మాట్లాడేందుకు వచ్చిన టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు సంజయ్‌కుమార్, నాయకుడు వాసాల సంపత్‌లను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని టీఎస్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణిరామ్‌సింగ్ అన్నారు. గని విస్తరణ పేరుతో ఓపెన్‌కాస్టు చేస్తూ శ్రావణ్‌పల్లి చుట్టు పక్కల గ్రామాల ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. సమావేశంలో ఎస్‌సీఎల్‌యూ ఉపాధ్యక్షుడు గద్దెల నారాయణ, కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకుడు ఎండీ ఆజాం, తదితరులు పాల్గొన్నారు.





జూన్ 21 ప్రత్యేకత..

ఏటా జూన్ 21న సూర్యుడు భూమధ్య రేఖకు దూరంగా వెళ్తాడు. ఆ రోజు సమయం కొద్దిగా ఎక్కువగా ఉంటుంది. ఇదే రోజును ప్రపంచ యోగా దినోత్సవంగా నిర్ణయించడానికి ఇది ఒక కారణంగా చెప్తారు.

# ఆరోగ్య ‘యోగ’ం


సీహెచ్ శిరీష
శివనూరి హృషికేశ్

మంచిర్యాలటౌన్: దైనందిన జీవితంలో నిత్యం ప్రజలు ఏదో ఒక శారీరక సమస్యతో బాధపడుతున్నారు. ఉరుకులు, పరుగుల జీవితం, తీసుకునే ఆహారంలో పోషక విలువలు లోపించడం వలన అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. కరోనా వంటి విపత్తుల నుంచి రక్షించుకునేందుకు ఏకైక మార్గం మన రోగ నిరోధకశక్తిని పెంపొందించుకోవడమే. ఇందుకు యువత, చిన్నారులు, పెద్దలు, యోగాపై ఆసక్తి కనబరుస్తున్నారు. భారతదేశంలో పుట్టిన యోగా నేడు ప్రపంచ దేశాలలో విస్తరించింది. ప్రతిఒక్కరూ వ్యాయామంలో యోగానే ఆదర్శంగా తీసుకుంటున్నారు. ప్రపంచ దేశాలు గుర్తించడంతో ఐక్యరాజ్య సమితి 2015 జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించింది.

- ఉరుకులు పరుగుల జీవితంలో ముసురుకుంటున్న జబ్బులు
- యోగా సాధనతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం
- రోగ నిరోధక శక్తి పెంపు
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

### యోగా ఎంతో మేలు

యోగా సాధనతో శారీరక సామర్థ్యం పెరుగుతుంది. శరీరాకృతిని మెరుగుపరుస్తుంది. బరువు తగ్గడానికి, గుండె బలోపేతం కావడానికి, జీవన కాలం, ఆత్మ విశ్వాసం పెరగడానికి దోహదపడుతుంది. రోజుకు కనీసం 30 నిమిషాల పాటు యోగా చేస్తే చాలావరకు జబ్బుల నుంచి దూరంగా ఉండవచ్చని యోగా నిపుణులు సూచిస్తున్నారు.

### రాష్ట్రస్థాయిలో రాణించి



2022లో తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టేట్ లెవల్ జడ్జెస్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో ఏ గ్రేడ్‌తో ఉత్తీర్ణత సాధించా. డ్రీమ్ యోగా సెంటర్ ఆధ్వర్యంలో 2019లో నిర్వహించిన నాలుగు జిల్లాల స్థాయి పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించా. 2020లో డ్రీమ్ యోగా సెంటర్ నేషనల్ లెవల్ ఆన్‌లైన్ యోగాసన చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని ద్వితీయస్థానంలో నిలిచా. 2021లో జిల్లాస్థాయి పోటీల్లో, నేషనల్ లెవల్ పోటీల్లో పాల్గొని ప్రథమస్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్స్ సాధించా.
– లెక్కల హారిక, మంచిర్యాల

### యోగాతోనే ఆరోగ్యం



యోగాతో ఎలాంటి దీర్ఘకాలిక వ్యాధులు దరిచేరవు. వ్యాధులను పూర్తిగా అదుపులో ఉంచేందుకు యోగా దోహదపడుతుంది. ధ్యానం, ప్రాణాయామం వంటి ఆసనాలు ఒత్తిడిని దూరం చేయడంతో పాటు, రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. కరోనా వంటి వైరస్‌ల ముప్పు నుంచి కాపాడుతాయి. చిన్నారుల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రతను పెంపొందిస్తాయి.
– డాక్టర్ సమీర, మైత్రి యోగా శిక్షకురాలు, మంచిర్యాల

### యోగాలో ప్రతిభ



2018లో యోగా ఇన్‌స్ట్రక్టర్ కోర్సును పూర్తి చేశా. 2019లో మైత్రి యోగా నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ద్వితీయస్థానంలో, డ్రీమ్ యోగా సెంటర్ ఆధ్వర్యంలో మందమర్రిలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమస్థానంలో, సప్తరిషి యోగా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయ స్థానంలో గెలుపొందా.
– సామల మౌనిక, మంచిర్యాల

### 20 ఏళ్లుగా శిక్షణ ఇస్తున్నా..



శ్రీరాంపూర్: యోగా జీవితంలో ఒక భాగం కావాలి. సింగరేణి కార్మికులు, కుటుంబ సభ్యులకు 20 ఏళ్లుగా ఉచితంగా యోగాలో శిక్షణ ఇస్తున్నా. కేవలం సేవా దృక్పథంతో డ్యూటీ విరామ సమయంలో ఉదయం, సాయంత్రం వేళల్లో యోగా నేర్పిస్తున్నా. ఇప్పటి వరకు సుమారు వెయ్యి మందికి యోగా శిక్షణ ఇచ్చా. ఆర్కే 6 గనిలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేసి ఇటీవలే రిటైరయ్యా. – కే.ఐలయ్య

### శారీరక, మానసిక శుద్ధి చేస్తుంది



శ్రీరాంపూర్: కంపెనీ ఆధ్వర్యంలో ఇచ్చిన శిక్షణ ద్వారానే యోగా నేర్చుకున్నా. ఆతర్వాత కోర్సులు పూర్తిచేసి కంపనీలోనే క్లాసులు నిర్వహిస్తున్నా. నేయోగాతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసికంగా కూడా శుద్ధి చేస్తుంది. సెల్ఫ్ కాన్ఫిడెన్స్ పెంచుతుంది. నిత్యం ఇంటి వద్ద యోగా చేయడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక జబ్బులను అదుపులో ఉంచుతుంది. నరాల జబ్బులు, కీళ్లనొప్పులు, బరువు తగ్గడం వంటి వాటికి యోగా చక్కగా ఉపయోగపడుతుంది.
– సీహెచ్ శిరీష

### ఆసనాల్లో అద్భుత ప్రతిభ


శీర్షాసనం


ప్రశంస పత్రం, మెమొంటోతో దినేష్

కెరమెరి(ఆసిఫాబాద్): మండల కేంద్రానికి చెందిన లక్ష్మణ్ పురి, సునంద దంపతుల కుమారుడైన దినేష్ పురి బెంగళూరులోని ఎస్‌వ్యాస యూనివర్సిటీలో యోగాలో శిక్షణ పొందాడు. పార్శ్వబకాసన, మరిచయాసన, చక్రసనా, జానుశీర్షాసన, మత్స్యాసన, గోరఖశాసన, సర్వాంగాసన, హలాసనా, కర్ణపీడాసన, కుక్కుటాసన, వృశ్చికాసన, ఉత్కటాసన, ఏకపాదబకాసన, స టరాజసన, వీరబద్రాసనా, శీర్షాసన, గర్భపీడాసన, పశ్చిమొత్తాసన, తదితర, ఆసనాలు సునాయాసంగా వేయగలడు. 2019లో సిద్దిపేటలో నిర్వహించిన 6వ తెలంగాణ స్టేట్ లెవల్ యోగా చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని ప్రశంసపత్రం అందుకున్నాడు. అదే సంవత్సరంలో బెంగళూరులో నిర్వహించిన అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని ప్రశంసపత్రం అందుకున్నాడు.

### యోగాకు మారుపేరు ‘రోటిగూడ’


ప్రశంసపత్రం అందుకుంటున్న హృషికేశ్(ఫైల్)

జన్నారం (ఖానాపూర్): మండలంలోని రోటిగూడకు ఓ ప్రత్యేకత ఉంది. ఆ గ్రామంలోని గీతామాత ఆలయంలో శ్రీహరి మౌనస్వామి యోగా, ధ్యానం చేస్తూ ఆధ్యాత్మికత పెంపొందిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడు శివనూరి తిరుపతి ఆధ్వర్యంలో ఆరేళ్లుగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఉచితంగా యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. సుమారు 40 మంది విద్యార్థులు యోగాలో శిక్షణ పొందుతున్నారు. ఇందుకు గ్రామస్తులు ఉచితంగా మ్యాట్‌లు పంపిణీ చేశారు.

**జాతీయస్థాయిలో రాణింపు**

2020 మే 20 న ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా ప్రదర్శనలో రోటిగూడకు చెందిన 8 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చి ప్రశంస పత్రాలు అందుకున్నారు. 2018లో మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొన్న గ్రామానికి చెందిన విద్యార్థులు శివనూరి హృషికేశ్, హర్మిత్ సాయి బంగారు పతకాలు సాధించారు. 2022 జూన్‌లో ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి యోగా పోటీలలో శివనూరి హృషికేశ్, పాదం బాలాజీ, హర్మిత్‌సాయి, దేవరకొండ సురేశ్ ప్రశంస పత్రాలు అందుకున్నారు. మంచిర్యాలలో జరిగిన తెలంగాణ ఉత్సవాల్లో భాగంగా కలెక్టర్, ఎమ్మెల్యే చేతుల మీదుగా హృషికేశ్ ప్రశంస పత్రం అందుకున్నారు.

#### శిక్షణ కొనసాగిస్తా..



గ్రామంలోని విద్యార్థులు యోగాలో శిక్షణ పొందడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం క్రమం తప్పకుండా యోగా శిక్షణ తరగతులకు హాజరవుతున్నారు. వారిలో ఉన్న ఆసక్తి వల్లే జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు తీసుకెళ్తున్నా. మారుమూల గ్రామానికి చెందిన విద్యార్థులు జాతీయస్థాయిలో రాణించడం ఆనందంగా ఉంది. శిక్షణ ఇలాగే కొనసాగిస్తా. – శివనూరి తిరుపతి, వ్యాయామ ఉపాధ్యాయుడు

## ప్రమాదవశాత్తు కాలువలోపడి వ్యాపారి మృతి


గోవింద్‌రెడ్డి (ఫైల్)

వాంకిడి(ఆసిఫాబాద్): ప్రమాదవశాత్తు కాలువలో పడి వ్యాపారి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన చిడిపూడి గోవింద్‌రెడ్డి (46) ఎరువులు, విత్తనాల వ్యాపారం చేస్తున్నాడు. సోమవారం ఉదయం వసూళ్ల కోసం బైక్‌పై కెరమెరి మండలంలోని నిషాని గ్రామానికి వెళ్ళాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్‌చేయగా ఇందాని సమీపంలో ఉన్నట్లు తెలిపాడు. అనంతరం వాంకిడికి చెందిన ఓ వ్యాపారికి ఫోన్‌చేసి డబ్బులు వసూలయ్యేలా లేవని, అప్పులు తీర్చడం కష్టంగా మారిందని వాపోయాడు. అతని మాటలతో అనుమానం వచ్చిన స్థానికులు ఇందాని సమీపంలోని కుమురంభీం ప్రధాన ఎడమ కాలువ మీదుగా వెతుక్కుంటూ వెళ్తుండగా కాలువ పక్కన బైక్, చెప్పులు వదిలి ఉండటాన్ని గమనించి కాలువలో గాలించగా మృతదేహం లభ్యమైంది. పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని ఆసిఫాబాద్ ఆస్పత్రికి తరలించారు. బహిర్భూమికి వెళ్లి కాలుజారి కాలువలో పడడంతో ఈతరాక మృతి చెందాడని మృతుని భార్య వాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## ‘విచారణ పేరుతో జాప్యం సరికాదు’


మాట్లాడుతున్న అబ్దుల్ ఖాదిర్

శ్రీరాంపూర్(మంచిర్యాల): విచారణ పేరుతో సింగరేణి యజమాన్యం జాప్యం చేయడం సరికాదని కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఎంవోఏఐ) ప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం శ్రీరాంపూర్‌లోని ఇల్లందు క్లబ్‌లో బెల్లంపల్లి, రామగుండం రీజియన్ల పరిధిలోని ప్రతినిధుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. తమ సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా సీఎంవోఏఐ శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదిర్ మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఓసీపీలో ఎలాంటి సంబంధం లేని 32 మంది అధికారులకు చార్జిషీట్లు ఇచ్చి ఎలాంటి చర్యలు లేకుండా నాలుగేళ్లుగా ఎంక్వయిరీల పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. దీంతో ఎలాంటి తప్పుచేయని అధికారులు తప్పుడు చార్జిషీట్ల కారణంగా శిక్ష అనుభవిస్తున్నారన్నారు. వెంటనే దీనిపై యజమాన్యం స్పందించి చార్జిషీట్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏరియా జీఎం సంజీవరెడ్డికి దృష్టికి సమస్యలు తీసుకెళ్లగా ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. సమావేశంలో ఏరియా జీఎంలు చింతల శ్రీనివాస్(ఆర్జీ 1), మనోహర్(ఆర్జీ 2), అపెక్స్ కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు ఏవీ రెడ్డి, నాయకులు చిలక శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ చంద్రమౌళి రమేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

## ‘పునరావాసం కల్పించకుంటే ఓసీని అడ్డుకుంటాం’


మాట్లాడుతున్న దుబ్బగూడెం యువకులు

కాసిపేట(బెల్లంపల్లి): మందమర్రి ఏరియా కళ్యాణిఖని ఓసీపీ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, పునరావాసం కల్పించకుంటే ఓపెన్‌కాస్టు ప్రాజెక్టును అడ్డుకుంటామని దుబ్బగూడెం యువకులు హెచ్చరించారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఓపెన్‌కాస్టు బ్లాస్టింగ్‌లతో గతేడాది వర్షాకాలంలో సుమారు 20 ఇళ్ల వరకు కూలిపోయాయని గుర్తు చేశారు. గతంలో గ్రామస్తులతో కలిసి ఓపెన్‌కాస్టు ప్రాజెక్టును అడ్డుకునేందుకు సిద్ధంకాగా నెలరోజుల్లో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లింపు, పునరావాసం కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చి పట్టించుకోవడం మరిచారన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువకుల ప్యాకేజీ వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఓరం కవిరాజ్, మహేష్, సురేష్, ప్రసన్న, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీపీపీ విస్తరణతో నిరుద్యోగులకు ఉపాధి

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్


అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బాల్క సుమన్

జైపూర్(చెన్నూర్): సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంటు విస్తరణలో భాగంగా మరో 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంటు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని, ఎస్టీపీపీ ప్రభావిత 9 గ్రామాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ తెలిపారు. జైపూర్ మండలం ఎల్కంటి, వేలాల, పొనూర్ గ్రామాల్లో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవర్ ప్లాంటు విస్తర్ణతో సుమారు 400 నుంచి 500 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం కుందారంలో రూ.1.56 కోట్లతో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. జెడ్పీటీసీ మేడి సునీత, పంచాయతీరాజ్ డీఈ స్వామిరెడ్డి, తహశీల్దార్ మోహన్‌రెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, ఐసీడీఎస్ సీడీపీవో మనోరమ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బల్మూరి అరవిందర్‌రావు, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు బేతు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.